ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

ఆదివారం 22 సెప్టెంబరు 2024

గరిష్ఠం 28.5
కనిష్ఠం 23.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.80 (311.4474)	7,699	44,943
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	1,825	435.94
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.89 (45.61)	29,845	33,640

చికెన్ ధరలు | లైవ్ : రూ.145 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

చాకలిగట్టుకు మహర్దశ



చాకలిగట్టు

- 407 ఎకరాల విస్తీర్ణం
- నాగార్జున సాగర్ జలాశయంలో మరో పర్యాటక ప్రాంతం
- కృష్ణమ్మ ఒడిలో అద్భుత ద్వీపం చాకలిగట్టు
- పర్యాటక కేంద్రంగా మార్చే ఆలోచనలో ప్రభుత్వం

నాగార్జునసాగర్, సెప్టెంబరు 21 : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో మరో పర్యాటక కేంద్రం అందుబాటులోకి రానుంది. సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో తవ్వకాల్లో బయల్పడిన బౌద్ధ మత నమూనాలను సాగర్ జలాశయం మధ్యలోని నాగార్జునకొండలో 1966లో పురావస్తు శాఖ మ్యూజియం నిర్మించి భద్రపరిచింది. దీంతో ఈ మ్యూజియాన్ని తిలకించేందుకు ప్రతీ ఏటా దేశ, విదేశాల నుంచి పర్యాటకులు సాగర్‌కు వస్తుంటారు. లాంచీలో వెళ్లి మ్యూజియంను తిలకించడంతో పాటు ఇక్కడ ఆనందంగా గడుపుతారు. ప్రస్తుతం దానిపక్కనే 1.5 కిలోమీటరు దూరంలో చాకలిగట్టు అనే అటవీ శాఖ జింకల పెంపక కేంద్రం ఉంది. ఈ గట్టును ఎకో టూరిజం కేంద్రంగా మార్చాలని రాష్ట్ర పర్యాటక శాఖ యోచిస్తోంది. దీంతో చాకలిగట్టుకు మహర్దశ పట్టనుందని భావిస్తున్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను పర్యాటక శాఖ మరింతగా అభివృద్ధి చేసి ఆదాయాన్ని సమకూర్చాలని భావిస్తోంది. దీంతో గత నెలలో రాష్ట్ర పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎండీలు సాగర్‌ను సందర్శించి చాకలిగట్టును పరిశీలించారు. చాకలిగట్టును ఎకో టూరిజం కేంద్రంగా ఏర్పాటుచేస్తే రాష్ట్ర పర్యాటక శాఖకు మరింత ఆదాయం సమకూరుతుందని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు నివేదికలు తయారు చేసి మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి చాకలిగట్టును ఎకో టూరిజం కేంద్రంగా చేయాలని నిర్ణయించారు.

రెండు పర్యాయాలు అధికారుల సర్వే

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఇప్పటికే నెల రోజుల వ్యవధిలో పురావస్తు శాఖ విభాగానికి చెందిన ఉన్నతాధికారులతో పాటు రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలిసి సర్వేలు చేశారు. మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. మొదటగా రూ.100 కోట్లతో చాకలిగట్టుపై కాటేజీలు, విద్యుత్ సౌకర్యం, తాగు నీటి సౌకర్యం, వంటి మౌలిక వసతులతో పాటు పర్యాటకులు రాత్రి వేళల్లోనూ అక్కడ బస చేసేలా టెంట్ కాటేజీలను కూడా ఏర్పాటుచేయాలని రాష్ట్రపర్యాటక శాఖ నిర్ణయించినట్లు సమాచారం.


సాగర్ జలాశయం

ప్రకృతి రమణీయం..

నల్లటి దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో పక్షుల కిలకిలలతో, కృష్ణమ్మ జలసవ్వడితో ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకునే అద్భుతమైన పర్యాటకప్రాంతాలు అంతర్జాతీయ పర్యాటక ప్రాంత మైన నాగార్జునసాగర్‌లో ఉన్నాయి. సాగర్ హిల్‌కాలనీ డౌన్ పార్క్ వద్ద ఉన్న తెలంగాణ లాంచీ స్టేషన్ నుంచి జలాశయం మధ్యలో ఏపీ అటవీ ప్రాంతంలోని నాగార్జునకొండకు వెళ్లే మార్గంలో హిల్‌కాలనీ లాంచీ స్టేషన్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో నాగార్జునకొండ ఉంటుంది. అక్కడి నుంచి కేవలం 1.5 కిలోమీటర్ల దూరంలో 407 ఎకరాల్లో చాకలిగట్టు విస్తరించి ఉంది. అటవీశాఖ ఆధ్వర్యంలో జింకల పెంపక కేంద్రంగా ప్రస్తుతం పేరొందింది. విశాలంగా చుట్టూ నీటితో ద్వీపకల్పంగా ఉండే చాకలిగట్టు ప్రకృతి రమణీయతకు నిలయంగా ఉంటుంది. అద్భుతమైన ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే మరింత శోభ వచ్చే అవకాశం ఉంటుంది. అదేవిధంగా సాగర్‌లో మరో పర్యాటక ప్రాంతంగా వెలుగొందనుంది.

అన్ని సెక్షన్లపై ఆ సారు
కర్రపెత్తనం

- రెండు నెలలుగా ఆడిందే ఆట
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా మారని తీరు
- ఇది నల్లగొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిస్థితి





నల్లగొండ, సెప్టెంబరు 21: జిల్లా కేంద్రలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ ఉద్యోగి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. రెండు నెలల క్రితం మునుగోడు నియోజకవర్గంలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చి జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని అన్ని సెక్షన్లపై కర్ర పెత్తనం చెలాయిస్తున్నట్లు తెలిసింది. తనకు ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయంటూ ఇతర ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వినికిడి. గతంలో పనిచేసిన ప్రాంతంలోనూ ఇలాగే వ్యవహరించగా, మెమో కూడా జారీ అయినట్లు సమాచారం. ఇటీవల బదిలీల్లో అతడు నల్లగొండ కార్యాలయానికి రాగా, వచ్చిన నాటి నుంచి ఆడిందే ఆటగా మారింది. అతడు పెడుతున్న ఇబ్బందులను భరించలేక తోటి ఉద్యోగులు సంబంధిత కార్యాలయ ఉన్నతాధికారికి ఫిర్యాదు కూడా చేశారు. దీంతో సదరు అధికారి ఆ ఉద్యోగిపై తీవ్ర స్థాయిలో మండిపడటమేగాక, మరోసారి ఇతర సెక్షన్లలో పెత్తనం చెల్లాయిస్తే సహించేది లేదని స్పష్టం చేసినా, అతడి తీరులో మార్పు రాలేదనే చర్చ సాగుతోంది.

హద్దులు దాటిన వ్యవహారశైలి

ఆ సార్ వ్యవహారశైలి హద్దులు దాటుతోందని తోటి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇతర సెక్షన్లలో వేలు పెట్టడమేగాక తోటి ఉద్యోగుల పట్ల అనుచితంగా, అవమానకరంగా వ్యవహరిస్తున్నట్టు సంబంధితశాఖలో జోరుగా చర్చ సాగుతోంది. దీనికి తోడు ఈసీలు, సీసీలను కూడా నిబంధనలకు విరుద్ధంగా జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. ఒకే నెంబర్‌పై 10 ఈసీలను జారీ చేయడం కూడా అధికారుల దృష్టికి వెళ్లినట్టు సమాచారం. తానే అన్నీ, తానే బాస్ అని ప్రవరిస్తుండటంతో తోటి ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు చక్కదిద్దాలని చూస్తున్నా, పరిస్థితులు చేయిదాటినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులు సబంధిత కార్యాలయ ఉన్నతాధికారులతో పాటు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు, కలెక్టర్, ఆ తరువాత రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాలని సిద్ధపడినట్టు సమాచారం.

ఉద్యోగి తీరు నా దృష్టికి వచ్చింది

నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆ ఉద్యోగి అనుసరిస్తున్న తీరు, వ్యవహారశైలి నా దృష్టికి వచ్చింది. ఇతర సెక్షన్లలో జోక్యం చేసుకుంటున్నట్లు, తోటి ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై ఆ ఉద్యోగిని మందలించడమేగాక, ఇతర సెక్షన్లలో జోక్యం చేసుకుంటే శాఖాపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించా. తిరిగి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎవరైనా బాధిత ఉద్యోగులు ఫిర్యాదు చేస్తే విచారణ చేయిస్తాం.

- రఘువర్ధన్, సబ్ రిజిస్ట్రార్, నల్లగొండ

రూరల్ పోలీస్ స్టేషన్‌కు వాస్తుదోషం!

- గతంలో నలుదిక్కుల ద్వారాలు ఏర్పాటు
- రెండింటినీ గతంలో మూయించిన ఓ ఎస్‌ఐ
- వాస్తును సరిదిద్దిన వారికీ తప్పని అనూహ్య స్థానచలనం
- తాజాగా దక్షిణం గేటుకు తాళం
- స్టేషన్ ద్వారాల మార్పులపై పోలీస్‌శాఖలో చర్చ


పోలీస్‌స్టేషన్‌లో మూసివేసిన దక్షిణం వైపు గేటు

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 21: జిల్లాలోనే అత్యంత పెద్దమండలంగా ప్రఖ్యాతి, వ్యాపార,వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు పుట్టినిల్లుగా పేరొందింది. అందుకే కాబోలు ఆ ఠాణా పోస్టింగుల కోసం ఖాకీలు పోటీపడుతుంటారు. దామరచర్ల, వేములపల్లి, త్రిపురారం, నిడమనూరు మండలాల సరిహద్దులతో మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి విస్తరించి ఉంది. అదేవిధంగా అద్దంకి-నార్కట్‌పల్లి, కోదాడ-జడ్చర్ల జాతీయరహదారులు విస్తరించి ఉన్న ఆ పోలీస్ స్టేషన్ బాస్‌కు ఆ శాఖలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందనే ప్రచారం కూడా ఉంది. అందుకే ఈ స్టేషన్ బాస్‌గా వచ్చేందుకు రాజకీయ పైరవీలు షరా మాములే. అయితే ఇంతగా చెప్పుకుంటున్న ఈ రక్షకభట నిలయానికి పట్టిన వాస్తుదోషం ఎంతకు వీడటం లేదన్న ప్రచారం తాజాగా సొంతశాఖలో జోరందుకుంది. ఠాణాలో ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన వారికి వాస్తు దోషం కారణంగా ప్రతికూల పరిస్థితులు ఎదురై కొద్దినెలల్లోనే అనూహ్యంగా స్థానచలనం కలుగుతోందన్న భావన పోలీసు వర్గాల్లో బలపడుతోంది.

2013లో స్టేషన్ తరలింపు

మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వెనుకభాగంలో ఉన్న రూరల్ పోలీస్‌స్టేషన్‌ను 2013లో పాత వ్యవసాయ మార్కెట్‌లోకి మార్చారు. అప్పటి వరకు మార్కెట్ కమిటీ చైర్మన్, కార్యదర్శి ఉపయోగించిన భవనాన్ని పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. ఇప్పటి వరకు తొమ్మిది మంది ఎస్‌ఐలు ఇక్కడ పనిచేశారు. అయితే 2018లో సొంత పనిమీద స్టేషన్‌కు వచ్చిన ఓ వాస్తు సిద్ధాంతి కొన్ని సూచనలు చేయడంతో అప్పట్లో విధులు నిర్వహించిన ఓ ఎస్‌ఐ భవనం వాస్తు సరిచేసేందుకు పూనుకున్నారు. రాకపోకలు కొనసాగించేందుకు నలుదిక్కుల (తూర్పు, పడమర. దక్షిణం, ఉత్తరం) ద్వారాలు ఏర్పాటు చేసి రూపురేఖలు మార్చేశారు. ఈ పనిచేసిన కొద్ది నెలలకే ఓ సివిల్ వివాదంలో తలదూర్చారన్న ఆరోపణలతో సదరు ఎస్‌ఐపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. ఆ తరువాత విధుల్లో చేరిన మరో ఎస్‌ఐ తూర్పు, పడమర ద్వారాలు మూయించి ఉత్తర, దక్షిణ గేట్ల నుంచి రాకపోకలు సాగేలా ఏర్పాట్లు చేశారు. అయినా ఆ ఎస్‌ఐకి అంతగా కలిసిరాలేదట. విధుల్లో అసమతుల్యత, ఆర్థిక అస్థిరత, మానసిక ఒత్తిడి, అపనిందలతో ఆయన బదిలీపై వెళ్లారన్న ప్రచారం ఉంది. ఇలా వాస్తుశాస్త్రాన్ని పరిగణించి దోషాలను సరిదిద్దిన వారంతా కొద్దినెలలకే బదిలీలు, వీఆర్‌కు వెళ్లడంపై పోలీస్ వర్గాల్లో ఈ స్టేషన్‌కు వాస్తుదోషం పట్టిందన్న చర్చ కొనసాగుతోంది.



దక్షిణం గేటుకు తాళం

రూరల్ పోలీస్‌స్టేషన్‌కు దక్షణం వైపు ఏర్పాటు చేసిన పెద్దగేటుకు తాజాగా తాళం పెట్టారు. ఇటీవల ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ పలు ఆరోపణలు ఎదుర్కొంటూ వీఆర్‌కు వెళ్లారు. అదే సమయంలో దక్షిణ ద్వారానికి తాళం వేయడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. మండలంలోని మారుమూల గ్రామాల నుంచి స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులు రాజీవ్‌చౌక్, ఆర్డీవో కార్యాలయం నుంచి ఉన్న ప్రధాన వీధుల నుంచి కాలినడకన, మోటారు సైకిళ్లపై ఇక్కడకు వచ్చి దక్షిణం వైపు ఉన్న గేటు నుంచి లోపలికి వెళ్తుంటారు. వాస్తుదోషం ఉన్నదో లేదో తెలియదుగానీ, దక్షిణ ద్వారాన్ని తాజాగా మూసివేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం స్టేషన్‌లోకి ప్రవేశించేందుకు పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఉత్తర దిశగా ఏర్పాటు చేసిన ప్రధాన గేటు నుంచి సిబ్బంది, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. స్టేషన్ రాకపోకలకు అనువుగా ఏర్పాటు చేసిన ప్రధాన గేట్లను ఏటా ఏదో ఓ వైపు నుంచి మూసివేయడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఓ కానిస్టేబుల్ ఇక్కడ సెక్యూరిటీ విధులు నిర్వహించాల్సి వస్తున్న నేపథ్యంలో లోపలికి వచ్చిపోయే వారిని గమనించేందుకు ఒకే గేటును రాకపోకలకు ఉపయోగిస్తున్నట్టు కొందరు పోలీసులు పేర్కొంటుండగా, పక్కనే ఉన్న సీఐ కార్యాలయానికి వచ్చే వారంతా రూరల్ స్టేషన్‌లోకి ప్రవేశించి సమాచార లోపంతో తమ సమయాన్ని వృథా చేసుకుంటున్నారన్న భావనతో దక్షిణం గేటును మూసి వేశారని స్టేషన్ సిబ్బంది చెబుతున్నారు. ఏది ఏమైనా స్టేషన్ ద్వారాలు వాస్తుదోషంతో మూసివేస్తుండటం పోలీసు వర్గాలతోపాటు, స్థానికంగా చర్చనీయాంశమైంది.

‘ఉపాధి’ లక్ష్యాలను అధిగమించాలి

ఏపీడీ నర్సింహారావు



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

మునుగోడు, సెప్టెంబరు 21: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా చేపట్టి లక్ష్యాలను అధిగమించాలని ఏపీడీ నర్సింహారావు అన్నారు. శనివారం మునుగోడు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో మండల పరిధిలోని 27 గ్రామాల్లో 2023-24లో చేపట్టిన రూ.4.47కోట్లు విలువైన పనులపై అధికారులు సమీక్ష నిర్వహించారు. గ్రామాలవారీగా పనులకు సంబంధించిన నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ నిర్దేశించిన ప్రకారం అర్హులైన ప్రతి కూలీకి పనికల్పించాలన్నారు. ఉపాధి పనుల నిర్వహణలో ఎక్కడైనా అవకతవకలు జరిగినా, విధుల్లో నిర్లక్ష్యం చూపిన అధికారులు, సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వివిధ పనుల్లో కొలతల తేడాలు, చేయని పనికి చేసినట్లు, హరితాహారంలో నాటిన మొక్కలు ఆ ప్రదేశంలో లేకపోవటం, ఉన్న మొక్కలకు నీరు పోయకపోవటం వంటి అంశాలు సామాజిక తనిఖీలో తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రధానంగా పులిపలుపుల గ్రామంలో సెలవు రోజు ఆదివారం సైతం పనులు చేసినట్లు రికార్డులు నమోదు చేయటం వంటి వివిధ నివేదికలను పరిశీలించినట్లు తెలిపారు. వివిధ పనుల నిర్వహణపై విధుల్లో నిర్లక్షం చూపిన సిబ్బందిపై రూ.15వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. గ్రామాల్లోని వివిధ పనుల్లో రూ.93వేల విలువైన కొలతలు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో డీవీవో వేణుగోపాల్‌రావు, అంబుడ్స్‌మెన్ ఎండీ. గౌరీ, డీవీఎం గౌతమి, ఎంపీడీవో కె.పూజ, ఏపీవో శీనయ్య, ఎస్ఆర్‌పీ సాంబశివచారి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: ఏడీఏ


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ దేవ్‌సింగ్

వేములపల్లి, సెప్టెంబరు 21: ఎమ్మార్పీ ధరల కంటే అధికరేట్లకు ఎరువులను విక్రయిస్తే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ దేవ్‌సింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్ డీలర్స్‌తో సమావేశాన్ని ఏర్పాటుచేసి మాట్లాడారు. ఆ డీలర్లు స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కొరత లేనందున ముందస్తుగా యూరియాను అందుబాటులో ఉంచుకొని రైతులకు ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలని, కృత్రిమంగా కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఏవో రుషేంద్రమణి, ఏఈవోలు ధీరావత్ నితిన్‌నాయక్, బంటు సంతోష్, గోలి మల్సూర్, డీలర్లు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి, రఘురామారెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ జాబితా పకడ్బందీగా రూపొందించాలి

మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్


సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

మిర్యాలగూడ, సెప్టెంబరు 21 : ఓటర్ జాబితాను బీఎల్ఓలు పకడ్బందీగా రూపొందించాలని సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ సూచించారు. ఓటర్ జాబితా మార్పులు, చేర్పులపై శనివారం బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లతో ఏఆర్పీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన అవగామన సమావేశంలో ఆయన మాట్లాడారు.

2025 జనవరి 1 నాటికి 18 ఏళ్ల నిండనున్న వారిని గుర్తించి అక్టోబర్ 18 వరకు ఇంటింటి సర్వేను నిర్వహించి నమోదుచేయాలన్నారు. ఫామ్ 6, 7, 8ల ద్వారా ఓటర్ల జాబితాలో చేర్పించడం, మార్పులు, తొలగింపులు సక్రమంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ హరిబాబు, డీఏఎన్‌పిఓ, సీడీపీఓ, ఎన్నికల డీటీ, ఏఎల్ఎంటీఈ పాల్గొన్నారు.

సాగర్ జలాశయంలో నీటి కుక్కల సందడి

నాగార్జునసాగర్, సెప్టెంబరు 21 : నాగార్జునసాగర్ జలాశయంలో నీటి కుక్కల సందడి చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఎగువ నుంచి వరద వచ్చిన సమయంలో వీటి సందడి నెలకొంటుంది. ఈ ఏడాది మొదటిసారిగా శనివారం సాగర్ ప్రధాన డ్యామ్‌కు దిగువన ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దులో ఉన్న ఆంజనేయస్వామి పుష్కర ఘాట్ వద్ద ఈ నీటి కుక్కలు కనిపించాయి. దాంతో పర్యాటకులు తమ సెల్‌ఫోన్లలో బంధిస్తూ ఆనందంగా గడిపారు. నీటి కుక్కలు నీటిలోనూ, భూమిపై కూడా జీవిస్తాయని, చేపలను ఆహారంగా తీసుకుంటాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. అంతరించిపోతున్న నీటి కుక్కల జాతిని ప్రజలు ఎవరూ వేటాడవద్దని అధికారులు సూచించారు.


సాగర్ జలాశయంలో నీటి కుక్కలు

బుద్ధవనాన్ని సందర్శించిన భూటాన్ పోలీస్ అధికారులు


బుద్ధవనంలో మహాస్థూపం లోపల భూటాన్ పోలీస్ అధికారులు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 21: నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని భూటాన్ పోలీస్ అధికారులు బృందం శనివారం సందర్శించింది. భూటన్ పోలీస్ శాఖ డిప్యూటీ చీఫ్(ఫైనాన్స్) వాంగ్ చుక్లా, పోలీస్ ఉన్నతాధికారి ఉగ్యేన్ రిక్ జిన్ నేతృత్వంలో ఆరుగురు అధికారులు బుద్ధవనం సందర్శించారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ అనంతరం వారు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్ధవనం ప్రత్యేకాధికారి ప్రకాశ్ రెడ్డి ఆహ్వానం మేరకు వచ్చినట్లు, సాగర్ సందర్శన తమకు తృప్తినిచ్చిందన్నారు. బుద్ధుడి బోధనలు, బౌద్ధ వాస్తు, శిల్ప సంస్కృతికి, సంబంధించిన అనేక విషయాలు తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. అలాగే జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండ మ్యూజియం, బౌద్ధ మత స్థూపాలు నమూనాలు, పునర్నిర్మిత కట్టడాలు, తమను ఆకట్టుకున్నాయని బృందం సభ్యులు తెలిపారు.

జిల్లాలో కురిసిన వాన


నల్లగొండలో కురుస్తున్న వాన

దేవరకొండ, సెప్టెంబరు 21: దేవరకొండ డివిజన్‌లో శనివారం ఉదయం నుంచి ముసురుతో కూడిన వర్షం కురుస్తుంది. డివిజన్ పరిధిలోని చింతపల్లి, చందంపేట, కొండమల్లేపల్లి, నేరేడుగొమ్ము, డిండి మండలాల్లో ముసురుతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో పత్తి రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. డివిజన్ పరిధిలో లక్షా 55వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటసాగు చేశారు. పూత, కాయకు వచ్చే సమయంలో ముసురుతో కూడిన వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురుస్తుండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

శాలిగౌరారం: భారీ ఈదురు గాలులకు శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలకు శాలిగౌరారంతో పాటు పలు గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. అక్కడక్కడ భారీ వృక్షాలు కూడా కూలి పోయాయి. ఆకారం గ్రామంలోని సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శాలిగౌరారంలోని గోదల వెంకట్‌రెడ్డి, తిరుమలరాయినిగూడెంలోని ఆదె వెంకన్నతోపాటు మరికొంత మంది రైతుల వరి పొలాలు పొట్ట దశలో ఉన్నవి నేలకొరగడంతో నష్టం జరిగింది. ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు పంట పొలాలను పరిశీలించి నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.


శాలిగౌరారంలో నేలకొరిగిన వరిపొలం

27న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 21: యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన జిల్లాకేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి బాలుర జూనియర్ కళాశాలలో జిల్లాస్థాయి యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో సీహెచ్.విష్ణుమూర్తిగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాలు నిండి 29 ఏళ్లలోపు ఉన్న యువతీ, యువకులు జానపద నృత్యాలు, జానపద పాటలు, సోలో సాంగ్స్, కవిత్వం, ఉపన్యాసం, వ్యాసరచన, పెయింటింగ్ వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హతగల యువతీ, యువకులు పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని తెలిపారు.

జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ఇవ్వడంతో రాష్ట్రస్థాయి పోటీలకు కూడా పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల యువతీ, యువకులు సెల్:8978900854ను సంప్రదించాలన్నారు.




యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు














స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని

నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 21 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవ తో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని మనోహరంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. శివాలయంలో నిత్యారాధనలు, రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.17,69,083 ఆదాయం సమకూరినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణికుముదిని, ప్రముఖ సినీ దర్శకుడు పూరి జగన్నాథ్ కొడుకు ఆకాశ్ దర్శించుకున్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా,ఈఓ లడ్డూ ప్రసాదం అందజేశారు.

నేడు మంత్రుల రాక

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆదివారం రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ నవీన్ (తీన్మార్‌మల్లన్న) దర్శించుకోనున్నారు. ఉదయం ఆలయంలో స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తారు. మంత్రుల రాక సందర్భంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం నియోజకవర్గ కేంద్రంలో ఆలేరు మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

గిరిప్రదక్షిణ చుట్టు బెంచీలు

యాద'గిరి'గుట్ట ప్రదక్షిణలు చేసే భక్తుల కోసం శనివారం భువనగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పద్మజా ఆసుపత్రి సహకారంతో బెంచీలు ఏర్పాటు చేశారు. గిరిప్రదక్షిణ చేసే దారిలో భక్తులు సేద తీరేందుకు 33సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు.సేవ దృక్పథంతో ఏర్పాటు చేసిన బెంచీలు మరిన్ని అందుబాటులోకి తేనున్నటు క్లబ్ అధ్యక్షుడు కరిపె నర్సింగ్‌రావు, కార్యదర్శి కూచిపట్ల సత్యనారాయణరెడ్డి, కోశాధికారి ఇటికాల దేవంద్రచారి, క్లబ్ మాజీ అధ్యక్షుడు పడమటి జగన్మోహన్‌రెడ్డి, బాలయ్య, పలుగుల ఆగేశ్వరరావు, వేమూరి అశోక్, హరికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

పేద కుటుంబాన్ని వరించిన ప్రభుత్వ ఉద్యోగం

గట్టికల్ యువకుడు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపిక



సూర్యాపేట, సెప్టెంబరు 21: నిరుపేద దళిత కుటుంబం జన్మించి స్వశక్తితో ఎదిగి ప్రభుత్వ ఉద్యోగం సాధించి తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నాడు ఆత్మకూర్ (ఎస్) మండలం గట్టికల్ గ్రామానికి చెందిన గాదె కోటేశ్. పోస్టు గ్రాడ్యుయేట్ పూర్తి చేసి ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తూనే, ప్రతిరోజు పాలను విక్రయించి, అనంతరం తాను పనిచేసే కళాశాలలో విధుల్లోకి వెళ్లే యువకుడు నేడు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించాడు. 2022లో వచ్చిన నోటిఫికేషన్‌కు ఈ ఏడాది జూన్‌లో పరీక్ష రాశాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో సోషల్ వెల్ఫేర్ అధికారిగా కోటేశ్ ఎంపికయ్యాడు. కోటేశ్‌కు రాష్ట్రస్థాయిలో 37వ ర్యాంకు వచ్చింది. యాదాద్రి భువనగిరి జోన్-5లో 9వర్యాంకు సాధించాడు. 2020లో కరోనా సమయంలో గట్టికల్‌లో డెయిరీ ఫామ్ ఏర్పాటు చేసి వివిధ గ్రామాల నుంచి పాలు తెచ్చి సూర్యాపేట, కుడకుడ, పీఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లలో ఇంటింటికీ తిరిగి పాలు విక్రయించేవాడు. కోటేశ్‌కు ప్రభుత్వ ఉద్యోగం రావడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.





ప్రైవేట్ వ్యక్తుల పేరిట ప్రభుత్వ భూమి

- ధరణి ఆపరేటర్ భూఅక్రమాలు
- 36.23 ఎకరాల ప్రభుత్వ భూమి బదలాయింపు
- మొత్తం భూమి విలువ రూ.18 కోట్లపైనే
- తల్లి, చెల్లి, కుటుంబ సభ్యుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు
- మరింత విచారణకు కలెక్టర్ ఆదేశం

రెవెన్యూ ఉన్నతాధికారుల అండదండలతో ధరణి ఆపరేటర్ అక్రమాలకు పాల్పడ్డాడు. ఏకంగా ప్రభుత్వ భూములను తన కుటుంబ సభ్యుల పేరు ధరణి రికార్డుల్లో నమోదు చేయించారు. డిజిటల్ పాస్‌పుస్తకాలు పొంది మూడేళ్లుగా రైతుబంధు పొందుతున్నాడు. ఎకరం, రెండు ఎకరాలు కాదు ఏకంగా 36 ఎకరాల పైనే ధరణిలో చేర్చి పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందడం గమనార్హం. మొత్తం భూమి విలువ రూ.18 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. ప్రస్తుతం ధరణి ఆపరేటర్‌ను రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు విచారిస్తున్నారు.

- హుజూర్‌నగర్


జగదీష్ ప్రైవేట్ వ్యక్తుల పేరిట నమోదు చేసిన ప్రభుత్వ భూమి ఇదే

సూర్యాపేట జిల్లాలో ధరణి పోర్టల్‌లో చోటుచేసుకున్న అక్రమాలు చర్చనీయాంశంగా మారాయి. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఒక రెవెన్యూ అధికారిపై భూమార్పిడికి సంబంధించి జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్న సమయంలో హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో జరిగిన అక్రమ భూమి పట్టా మార్పిడి వివరాలు వెల్లడించినట్లు తెలిసింది. తానొక్కడినే తప్పు చేయలేదని, ఇలాంటి తప్పులు హుజూర్‌నగర్ మండలంలో చాలా జరిగాయని చెప్పినట్లు సమాచారం. దీంతో ధరణి ఆపరేటర్ భూదందా వ్యవహారం వెలుగుచూసినట్లు తెలుస్తోంది. అయితే వెలుగుచూసింది గోరంత కాగా ఇంకా కొండంత ఉందని రెవెన్యూ వర్గాలే పేర్కొంటున్నాయి.

హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ ధరణి ఆపరేటర్ వత్సవాయి జగదీష్ తన కుటుంబ సభ్యులు, బంధువుల పేరు మీద ఏకంగా 36. 23 ఎకరాల భూమిని ధరణ పోర్టర్‌లో నమోదుచేసినట్లు ఇటీవల జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం రాత్రి వెల్లడించారు. 2019-20లో హుజూర్‌నగర్ మండలంలో పనిచేసిన ఉన్నతాధికారుల అండదండలతోనే ధరణి ఆపరేటర్ జగదీష్ ఈ దందాకు పాల్పడినట్లు సమాచారం. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ రెవెన్యూ పరిధిలో వేణుగోపాలస్వామి దేవాలయం, గోపాలపురం శివారు, పెద్దచెరువు, నల్ల చెరువు ప్రాంతాల్లో 36.23 ఎకరాల ప్రభుత్వ మిగులు భూమి ఉంది. ఆ భూమిని కొంతమంది వ్యక్తులు సాగు చేసుకుంటున్నారు. ఎకరం ఇక్కడ రూ.50 లక్షలపైనే ఉంది. ఈ భూమి విలువ సుమారు రూ.18కోట్లపైనే ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కోట్లు విలువచేసే భూమిని రెవెన్యూ అధికారుల అండందండలతో జగదీష్ అతడి కుటుంబ సభ్యుల పేరు మీద పోర్టర్‌లో నమోదు చేశాడు. బూరుగడ్డ గ్రామంలో 439 సర్వే నెంబర్‌లో 164 ఎకరాల 12 కుంటల భూమి, 604 సర్వే నెంబర్‌లో 164 ఎకరాల భూమి ఉంది. అతిపెద్ద సర్వేనెంబర్లు కావడంతో ప్రభుత్వ మిగులు భూమి అధికంగా ఉంది. వీటితో పాటుగా 602, 608, 1041 సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమి ఉండగా వాటన్నింటిని ధరణి ఆపరేటర్ కుటుంబ సభ్యుల పేరు మీద పోర్టర్‌లో నమోదుచేసినట్లు అధికారులు గుర్తించారు. 2019 నవంబరు నుంచి 2020 ఫిబ్రవరి మధ్య కాలంలో భూమి బదలాయింపులు జరిగినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. భూమి బదలాయింపుతో పాటు రైతుబంధు, రైతురుణమాఫీ లబ్ధికూడా పొందినట్లు సమాచారం. ప్రభుత్వ భూమి పట్టా మార్పుపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో శ్రీనివాసులు విచారణ జరిపి మూడు రోజుల కిందట నివేదిక అందించారు. ఆ నివేదిక వివరాలను డీపీఆర్వో రమేష్ శుక్రవారం రాత్రి మీడియాకు విడుదల చేశారు. అదేవిధంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ధరణి ఆపరేటర్ జగదీష్‌ను డిస్మిస్ చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో జగదీష్‌ను పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

జగదీష్ పట్టా చేసిన ప్రభుత్వ భూములు ఇవే

బూరుగడ్డ గ్రామంలోని సర్వే నెంబర్ 439/55/5లో 8 ఎకరాల 38 గుంటలు, 604/116లో 7.32 గుంటల భూమిని పచ్చిపాల ప్రియాంక పేరు మీద పోర్టర్‌లో నమోదు చేశారు. మొత్తంగా 15.7 ఎకరాలు ఆమె పేరు మీద నమోదుచేశారు.

సర్వే నెంబర్ 604/58లో 4.38 గుంటలు మడిపల్లి స్వప్న సోదరి పేరు మీద నమోదుచేశారు.

హుజూర్‌నగర్‌లోని 602/102/1లో 0.01 గుంటలు, 608/16లో 8.0 ఎకరాల భూమిని జగదీష్ తల్లి వత్సవాయి ఇందిర పేరు మీద నమోదు చేశారు.

అదేవిధంగా 1041/144లో 6.25 ఎకరాలు, 1041/368/3/2/5లో 0.10 గుంటల భూమిని ఇందిర పేరు మీద ఇలా మొత్తం 36.23 కుంటల ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా ధరణి పోర్టర్‌లో నమోదు చేసినట్లు విచారణలో తేలింది.

కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేశాం



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు బూరుగడ్డలోని పలు సర్వే నెంబర్లకు సంబంధించి విచారణ చేశాం. ధరణి ఆపరేటర్ జగదీష్ అతడి తల్లి, చెల్లి, కుటుంబ సభ్యుల పేరు మీద 36.23 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు విచారణలో తేలింది. నివేదికను కలెక్టర్‌కు అందించడంతో అదనపు కలెక్టర్ లతను పూర్తి విచారణ చేయాలని ఆదేశించారు. మండలంలో, పట్టణంలో ధరణిలో జరిగిన అవకతవకలపై మరోసారి కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం.

శ్రీనివాసులు, ఆర్డీవో, హుజూర్‌నగర్

విచారణకు ఆదేశం

బూరుగడ్డలో 36.23 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల పరం చేసిన అక్రమాలపై పూర్తి విచారణ కోసం అదనపు కలెక్టర్ లతను కలెక్టర్ తేజస్‌నందాలాల్ పవార్ నియమించారు. అప్పటి అధికారులపై సైతం విచారణ చేయాలని ఆదేశించారు. ధరణ ఆపరేటర్‌పైనే నెపమంతా నెట్టేసి అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కోట్లు విలువచేసే భూమి ఉన్నతాధికారుల సహకారం లేకుండా డిజిటల్ సంతకాలు ఎలా చేస్తారన్న అనుమానాలు ఉన్నాయి. దీంతో అప్పటి అధికారులను కూడా విచారించనున్నట్లు సమాచారం.

ఇతర గ్రామాల్లోనూ ప్రభుత్వ భూమి బదలాయింపు

హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలోనే కాకుండా హుజూర్‌నగర్ పట్టణం, లింగగిరి, అమరవరం, వేపలసింగారం, శ్రీనివాసపురం గ్రామాల్లో సైతం ధరణిలో ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారుల అండతో ప్రభుత్వ భూములను పక్కనే ఉన్న భూస్వాముల పేరు మీద ధరణి పోర్టర్‌లో నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. హుజూర్‌నగర్ పట్టణంలో 1041, 608, 154, 273 సర్వేనెంబర్లతో పాటు మరికొన్ని నెంబర్లలో సుమారు 300 ఎకరాలపైనే ప్రభుత్వ భూములను సన్న, చిన్నకారు రైతులకు, భూస్వాములకు ధరణి పోర్టర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నమోదు చేసినట్లు తెలుస్తోంది. హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురం, ముక్త్యాల మేజర్ కాల్వ సమీపంలో రామస్వామి గుట్టకు వెళ్లే దారిలో, వేపలసింగారం రోడ్డు, మట్టపల్లి, లింగగిరి రోడ్డులోని ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల పేర్ల మీద రికార్డుల్లోకి ఎక్కించినట్లు సమాచారం. ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని రికార్డులలో అక్రమంగా నమోదుచేసినట్లు విమర్శలు ఉన్నాయి. ధరణి వచ్చినప్పటి నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయగా అంతకుముందు మాన్యువల్‌గా రికార్డుల్లో నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా అధికారులకు తెలిసిన, బయటపడిన సమాచారం రూపాయిలో 10 పైసల వంతేనని, మిగిలిన 90 శాతం భూముల పరిస్థితి ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రభుత్వ భూముల లెక్కలు తీసి బదలాయింపు జరిపిన వివరాలపై విచారణ చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అధికారుల అండతో ఇసుక దందా

● బంగారంతో పోటీపడుతున్న ఇసుక ధర


ట్రాక్టర్ లోడుతో వెళ్తున్న ఇసుక

మద్దిరాల, సెప్టెంబరు 21 : అధికారుల అండతో సూర్యాపేట జిల్లా మద్దిరాలలో ఇసుక విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తరలించి కాసులు దండుకుంటున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన రెవెన్యూ, పోలీస్ సిబ్బంది చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో ప్రజలు ఇంటి ప్రహరీలు, మరుగుదొడ్ల నిర్మాణాల కోసం ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పాలేరు వాగు, జీ కొత్తపల్లి, ముకుందాపురం, పీర్యాతండా నుంచి రాత్రివేళ ఇసుకను జోరుగా ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఒక్కో ఇసుక ట్రాక్టర్ ధర రూ.5500నుంచి రూ.6500వరకు విక్రయాలు జరుగుతున్నాయి. ఇసుక ధరలను చూసి ప్రజలను బంగారంతో పోల్చుకుంటున్నారు. బంగారం మాదిరే ఇసుక ధరలు మండిపోతున్నాయని సామాన్యులు వాపోతున్నారు.

మా దృష్టికి రాలేదు, వస్తే చర్యలు తీసుకుంటా



మండలంలోని పాలేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు మా దృష్టికి తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కొంతమంది అధికారులు ఇసుకను గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తే వారిపై కూడా చర్యలు ఉంటాయి. ప్రభుత్వం నుంచి ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు.

- వీరన్న, ఎస్ఐ మద్దిరాల మండలం

డీసీఎం ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి


శేఖర్(ఫైల్)

మాడ్గులపల్లి, సెప్టెంబరు 21 : డీసీఎం, బైక్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలకేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై శనివారం జరిగింది. ఎస్ఐ శోభన్‌బాబు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఇందుగుల ఆవాస గ్రామమైన మలపరాజుగూడెం గ్రామానికి చెందిన పుట్ట శేఖర్(32) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. డీజిల్ కోసం శనివారం ఉదయం బైక్‌పై మాడ్గులపల్లి మండలకేంద్రానికి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన శేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. శేఖర్ మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. శేఖర్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా భార్య మనీషా ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ నిజాంఖాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..


సైదులు(ఫైల్)

సూర్యాపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. శనివారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రైతు మంచాల సైదులు(62) తన వ్యవసాయ బావివద్ద పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ట్రాన్స్‌పార్మర్ వద్ద విద్యుత్ ఆఫ్ అయి ఉండడంతో ఆన్‌చేయగా శిథిలావస్థలో ఉన్న ట్రాన్స్‌పార్మర్ వైరు తెగి మీద పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయాలయ్యాయి. సమీపంలో ఉన్న మహిళా రైతు గమనించి స్థానికులకు సమాచారం ఇచ్చింది. ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. సైదులుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పాముకాటుతో 15 నెలల చిన్నారి..



పవిత్ర(ఫైల్)

చందంపేట, సెప్టెంబరు 21: పాముకాటుతో 15 నెలల చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన శనివారం నల్లగొండ జిల్లా చందంపేట మండలం పొగిళ్ల గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పొగిళ్ల గ్రామానికి చెందిన జటావత్ గంగ, కిషన్ దంపతులు వ్యవసాయం చేసుకుంటు జీవిస్తున్నారు. శనివారం వ్యవసాయ పనులు ముగించుకొని రాత్రి భోజనం అనంతరం ఇంట్లో కింద నిద్రించారు. దంపతులకు ఒక్కగానొక్క కుమార్తె పవిత్ర (15 నెలలు) అర్ధరాత్రి ఏడుస్తుండడంతో మేలుకున్న తల్లిదండ్రులు పాప పక్కలో పాము ఉండటం చూసి కాటుకు గురైనట్లు గుర్తించారు. పామును చంపి చిన్నారిని చికిత్స కోసం దేవరకొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో పాప మృతి చెందింది. కుమార్తె మృతితో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుర్తుతెలియని వ్యక్తి

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 21 : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి గాయపడ్డాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో ఈనెల 19న జరిగిన సంఘటన వివరాలను రూరల్ ఏఎస్ఐ రాములునాయక్ శనివారం తెలిపారు. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి పక్కన గూడూరు గ్రామం వద్ద నిలబడి ఉన్న వ్యక్తిని దామరచర్ల నుంచి మిర్యాలగూడకు వస్తున్న బైక్ ఢీకొట్టగా తలకు గాయాలైనట్లు తెలిపారు. దామరచర్ల మండలం కొండ్రపోలు పరంగి మధు అనే వ్యక్తి తన బైక్‌ను అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణం కావడంతో గూడూరు గ్రామకార్యదర్శి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు. కాగా గాయపడ్డ వ్యక్తికి మతిస్థిమితం సరిగ్గా లేదని, వయసు సుమారు 55 ఏళ్ల వరకు ఉంటుందని, ప్రస్తుతం మిర్యాలగూడ ఏరియాఆస్పత్రిలో చికిత్స పొం దుతూ కోలుకుంటున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. ఇతర వివరాల కోసం 9441562204 నెంబరుకు సమాచారం అందించాలని ఏఎస్ఐ రాములునాయక్ కోరారు.

అత్తారింటి వేధింపులు తాళలేక ఆత్మహత్య



కరుణ(ఫైల్)

శాలిగౌరారం, సెప్టెంబరు 21 : అత్తారింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆకారం గ్రామానికి చెందిన సూరారపు రాజుకు నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన కరుణతో ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి మూడేళ్ల లోపు కుమార్తె, కుమారుడు ఉన్నారు. సూరారపు రాజు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్య కరుణను నిత్యం వేధిస్తున్నాడు. తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో కరుణ మనస్తాపం చెంది ఇంట్లో ముభావంగా ఉంటోంది. శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న నిద్రమాత్రలు వేసుకుంది. శనివారం తెల్లవారుజామున చనిపోయి ఉండటంతో భర్త రాజు తన మామ మాతంగి నర్సయ్యకు సమాచారం అందించారు. కుమార్తె మృతికి అల్లుడు రాజుతో పాటు కుటుంబసభ్యులు కూడా కారణమని నర్సయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఆస్పత్రికి తరలించారు.

రైస్‌మిల్లర్లపై కేసులు నమోదు

తిరుమలగిరి, సెప్టెంబరు 21 : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వని ఇద్దరు రైస్‌మిల్లు యజమానులపై కేసులు నమోదయ్యాయి. ఇందుకు సంబంధించి సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ఎస్ఐ సురేష్ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సివిల్ సప్లయ్ అసిస్టెంట్ మేనేజర్ బెనర్జీ ఫిర్యాదు మేరకు శ్రీలక్ష్మి రైస్ ట్రేడర్స్, హర్షిత రైస్‌మిల్లు యజమానులు గజ్జి ఉపేందర్, తునికిపాటి వినయ్ కుమార్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. 2022-24 అన్ని సీజన్లకు కలిపి శ్రీలక్ష్మీ ట్రేడర్స్ నుంచి రూ.25.40 కోట్లు, హర్షిత మిల్లు నుంచి రూ.16.28కోట్లు బకాయిలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

భీమనపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 21: యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శనివారం ఉదయం విగ్రహం ధ్వంసమై ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మీసాల గణేష ఎస్ఐ భాస్కర్‌రెడ్డికి ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు యాట కైలాసం, నాయకులు మీసాల గణేష్, కొమ్ము రమేష్, గూని బుచ్చయ్య, చెరుకు రాములు, కొమ్ము లింగస్వామి, మీసాల ప్రశాంత్, మీసాల తరుణ్, కొమ్ము రాకేష్, కొమ్ము సురేష్ పాల్గొన్నారు.


నీరందడం లేదని కాల్వలో రైతుల నిరసన


గోపాలపురం వద్ద డీ-37 కాల్వలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మాడ్గులపల్లి, సెప్టెంబరు 21: నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో సాగునీటి కోసం రైతులు శనివారం కాల్వలో నిలబడి నిరసన తెలిపారు. పంట పొలాలు ఎండిపోతున్నాయని, రెండు నెలలుగా కాల్వ నీటి కోసం ఎదురుచూస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎడమ కాల్వ పరిధిలోని డీ-37 కాల్వ నల్లగొండ మండలం గుండ్లపల్లి వద్ద ప్రారంభమై కనగల్, తిప్పర్తి, మాడ్గులపల్లి మండలంలోని కన్నెకల్ వరకు సుమారు 27.05 కిలోమీటరు వరకు ఉంది. సుమారు 42వేల ఎకరాల్లో ఆయకట్టుకు నీరందించడంతో పాటు 19 చెరువులను నింపేందుకు ప్రభుత్వం ఈ కాల్వ నిర్మించింది. ఏఎమ్మార్పీ కాల్వ ద్వారా నీటి విడుదల ఆగస్టు నుంచి కొనసాగుతున్నా, చివరి భూములకు నీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మాడ్గులపల్లి మండలం గోపాలపురం, మాచినపల్లి గ్రామాలకు చెందిన 20మంది రైతులు శనివారం కాల్వలో నిలబడి నిరసన తెలిపారు. రెండు నెలలుగా కాల్వకు నీటి విడుదల చేసినా చివరి భూములకు రావడంలేదని దీంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరితో పాటు ఎక్కువ మంది రైతులు బత్తాయి సాగు చేశారు. కాల్వకు నీరు రాకపోవడంతో బోరుబావులు అడుగంటిపోయాయని, కాల్వలో నీటి విడుదల సామర్థ్యాన్ని పెంచితే చివరి భూములకు నీరందడంతో పాటు భూగర్భజలాలు పెంపొందుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎగువన ఉన్న అన్నారం, బసిరెడ్డిపల్లి, ముశంపల్లి, ఎల్లపల్లి గ్రామాల రైతులు కాల్వకు అక్రమ తూములు ఏర్పాటుచేయడంతో నీరు చివరి భూములకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో నీటి కోసం వెళ్తే బసిరెడ్డిపల్లి గ్రామస్థులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. డీ-37 కాల్వ ద్వారా చివరి భూములకు నీరరందితే మాడ్గులపల్లి మండలంలోని గోపాలపురం, మాచినపల్లి, కన్నెకల్, కేశవాపురం గ్రామాల్లోని మూడు వేల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా, నీరు అందకపోవడంతో బోరుబావుల ఆధారంగా రైతులు సుమారు 1,000 ఎకరాల్లో వేసుకున్న వరి పొలాలు, బత్తాయి తోటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వల పర్యవేక్షణ చేసి అక్రమంగా ఏర్పాటుచేసిన తూములను తొలగించి చివరి భూములకు నీరందించాలని రైతులు బోడ యాదయ్య, జూలకంటి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నర్సిరెడ్డి, లక్ష్మణ్, శంకర్, వెంకటయ్య, యాదయ్య, అంజయ్య, కొమురయ్య, వెంకన్న, కొండలుతో పాటు పలువురు కోరుతున్నారు. సుమారు గంటకు పైగా నిరసన వ్యక్తం చేసి చివరి భూములకు నీరందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

నేడు హైదరాబాద్ టు బుద్ధవనానికి బైక్ ర్యాలీ

- 200 బైక్‌లతో 'నిర్వాణ' రైడ్
- ప్రారంభించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



'నిర్వాణ' ర్యాలీకి సంబంధించిన పోస్టర్

నాగార్జునసాగర్, సెప్టెంబరు 21: అంతర్జాతీయ బౌద్ధక్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీ బుద్ధవనంలో 274 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనానికి ఆదివారం హైదరాబాద్ నుంచి బైక్ రైడర్స్‌తో కలిసి 200 బైక్‌లతో 'నిర్వాణ రైడ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పర్యాటకశాఖ ఎండీ, బుద్ధవనం ప్రత్యేక అధికారి ఎస్.ప్రకాష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు హైదరాబాద్‌లో ది ప్లాజా హోటల్ వద్ద ఈ రైడ్‌ను పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ రైడ్ మధ్యాహ్నం 12గంటలకు సాగర్ బుద్ధవనానికి చేరుకుంటుందని తెలిపారు. మధ్యాహ్న భోజన అనంతరం బుద్ధవనాన్ని సందర్శించి తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

● బండి.. జగమొండి

క్లిక్ క్లిక్ click


నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి సూర్యాపేటకు వెళ్లే నల్లగొండ డిపోకు చెందిన ఆర్డీనరీ బస్సు ఎంతకూ స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికుల సహాయంతో డ్రైవర్ బస్సును స్టార్ట్ చేశారు.

ట్రాక్టర్ ట్రాలీల దొంగల రిమాండ్


ట్రాక్టర్ ట్రాలీలను చోరీ చేస్తున్న నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రాజు

డిండి, సెప్టెంబరు 21 : పొలాల వద్ద ఉంచిన ట్రాక్టర్ ట్రాలీలను అపహరించిన వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ జిల్లా డిండి ఎస్ఐ రాజు శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డిండి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన మాధవరం సంపత్‌రావు, నాగర్‌కర్నూల్ జిల్లా బలుమూరు మండలం గట్టుతుమ్మెన గ్రామానికి చెందిన బొలగం శ్రీను, అదే జిల్లా అచ్చంపేట పట్టణానికి చెందిన కదారి బాబు ముగ్గురు స్నేహితులు. వీరు ట్రాక్టర్ ట్రాలీల దొంగతనాలకు పాల్పడుతుంటారు. కామేపల్లి గ్రామానికి చెందిన ఎదుర్ల సందీప్ తన ట్రాక్టర్ ట్రాలీని పొలం వద్ద ఉంచాడు. అదే గ్రామానికి చెందిన సంపత్‌రావు సూచన మేరకు అతడి స్నేహితులు బొలగం శ్రీను తన సొంత ట్రాక్టర్ ఇంజన్‌తో బాబుతో కలిసి ఈ నెల 4న పొలం వద్ద ఉంచిన ఎదుర్ల సందీప్ ట్రాక్టర్ ట్రాలీని అపహరించి అచ్చంపేటకు తరలించి ఒక చోట ఉంచారు. ఈ నెల 21న అపహరించిన ట్రాక్టర్ ట్రాలీని దేవరకొండలో విక్రయించేందుకు బొలగం శ్రీను, కదారి బాబు తరలిస్తుండగా డిండి శివారులో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం పర్వతగిరికి చెందిన మరో రైతు ట్రాక్టర్ ట్రాలీని కూడా ఈ ఏడాది జూలై 12న కదారి బాబు అపహరించి ట్రాలీని విక్రయించి పెట్టాలని సంపత్‌రావుకు అప్పగించాడు. విచారణ జరిపిన పోలీసులు రెండు ట్రాక్టర్ ట్రాలీలను తరలిస్తున్న ఇంజన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురుని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ఇద్దరి అరెస్ట్, రిమాండ్

కనగల్, సెప్టెంబర్ 21: ఇసుక రవాణా కేసులో కోర్టుకు హాజరు కాని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ జిల్లా కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కనగల్ గ్రామానికి చెందిన నీలకంఠం ధనుంజయ్య, నక్క జగన్‌లపై జిల్లా స్పెషల్ మొబైల్ కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం సదరు వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ తెలిపారు. అనంతరం వీరిని కోర్టు ఆదేశాల మేరకు జైలుకు తరలించినట్టు వివరించారు.

నిలకడగా సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 21: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 589.80అడుగుల వద్ద నిలకడగా ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 7,699క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు(312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 589.80అడుగులు(311.4474టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4,287 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,136 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 44,943 నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 7,699 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో...

సాగర్ తర్వాత రెండో సాగునీటి ప్రాజెక్టుగా ఉన్న మూసీ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. 10రోజులకు పైగా వర్షాలు లేకపోవడంతో ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి, శనివారం వర్షాలు కురవడంతో వరద దిగువకు వచ్చి ప్రాజెక్టులో చేరుతోంది. శనివారం సాయంత్రానికి 1,825 క్యూసెక్కులుగా నమోదైంది. 645(4.46టీఎంసీలు) అడుగుల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 643.90(4.17టీఎంసీ)అడుగులుగా ఉంది. మరోవైపు కుడి,ఎడమకాల్వలకు సాగునీటి విడుదల కొనసాగుతోంది. కుడికాల్వకు 120.82 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 314.14క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

ఒక గేటు ద్వారా పులిచింతల నుంచి నీటి విడుదల

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175(45.77టీఎంసీలు)అడుగులు కాగా, శనివారం సాయంత్రానికి 174.89(45.61 టీఎంసీలు)అడుగులుగా నమోదైంది. ప్రాజెక్టు ఒక గేటు నుంచి 17,640క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కులను వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 104మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. మొత్తంగా అవుట్‌ఫ్లో 33,640 క్యూసెక్కులు, ఇన్‌ఫ్లో 29,845 క్యూసెక్కులుగా నమోదైంది.

వరి సాగు ఖర్చు తగ్గించుకోవాలి

● ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నల్లగొండటౌన్, సెప్టెంబరు 21: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సాగు ఖర్చు తగ్గించుకొని లాభదాయకతను పెంచుకోవడానికి నేరుగా వరి విత్తే వరి సాగుపై అవగాహన పెంపొందించుకోవాలని భారతీయ వరి పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) కీటక విభాగ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వై.శ్రీధర్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని భారతీయ వరి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో శనివారం తిప్పర్తి మండలంలోని ఎల్లమ్మగూడెంలో రైతులకు నేరుగా విత్తే పద్ధతిపై వరి సాగు చేసే రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సాగు ఖర్చు తగ్గించి లాభాలను పెంచుకోవాలని, ఈ మేరకు రైతులకు నేరుగా విత్తే వరిసాగుపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా వరిసాగు లాభసాటిగా చేసుకోవటానికి యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ల ద్వారా క్రిమీ సంహారక పిచికారీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నేరుగా విత్తే వరిసాగుకు హెక్టారుకు రూ.8 నుంచి 10 వేల వరకు ఖర్చు తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ టి.వెంకయ్య, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, యంగ్ ప్రొఫెషనల్ టి.శ్రీకాంత్, డ్రోన్ ఆపరేటర్ సంతోష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బీ.వెల్లెంలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 21: మధ్యతరహా నీటి ప్రాజెక్టు అయిన మండలంలోని బీ.వెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లిలో శనివారం నిర్వహించిన జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వల కోసం భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. కాల్వల పూర్తికి ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ.20 వేల చొప్పున పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా రైతు రుణమాఫీ కాని వారిని గుర్తించి అర్హులైన వారందరికీ రుణమాఫీ వర్తించే విధంగా స్పష్టమైన ప్రకటన చేయాలని అన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను తక్షణమే మరమ్మతు చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య, పెంజర్ల సైదులు, శ్రీరామోజు వెంకటేశ్వర్లు, చెర్కు పెద్దులు, చింతపల్లి బయ్యన్న, అరూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు సినీ స్వరాభిషేకం

మిర్యాలగూడ, సెప్టెంబరు 21: బాలు ఏఎన్ఆర్ స్మృతిలో ఈ నెల 22న సినీ స్వరాభిషేకం నిర్వహిస్తున్నట్లు గాయకులు ఏలే సత్యనారాయణ, శ్రీనివాసాచారి తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే బీఎల్ఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబరు మాసంలో అక్కినేని జయంతి, బాల సుబ్రహ్మణ్యం వర్ధంతిని పురస్కరించుకుని అక్కినేని నటించిన చిత్రాల్లో బాలు పాడిన పాటలతో కూడిన సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి గాయనీగాయకులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. కవులు, కళాకారులు సినీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎం.సత్యనారాయణచారి, కందుకూరి సుదర్శన్, కె. మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో వైభవంగా శోభాయాత్ర



స్వామివారికి పూజలు చేస్తున్న శోభ

నల్లగొండరూరల్, సెప్టెంబరు 20: నార్కట్‌పల్లి మండలంలో శనివారం ఘనంగా గణేష్ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు రేగట్టె శోభ మాట్లాడుతూ నిరంతరం నార్కట్‌పల్లి మండల ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని గణనాథుడి ఆశీర్వాదం గ్రామస్థులపై ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జీఎడవల్లి కొత్తచెరువు గండ్లు పూడ్చివేత



రైతులతో గండ్లు పూడ్చివేయిస్తున్న రాంరెడ్డి

కనగల్, సెప్టెంబరు 21: మండలంలోని జీఎడవల్లి గ్రామ కొత్తచెరువుకు పడిన గండ్లను బోయినపల్లి గ్రామానికి చెందిన రైతు నాయకుడు, కాంగ్రెస్ సీనియర్ నేత గానూతుల రాంరెడ్డి రూ.50 వేల సొంత ఖర్చుతో మరమ్మతు పనులను చేపట్టి పూడ్చివేశారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 18వ తేదీన 'జీఎడవల్లి చెరువుకు గండ్లు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. కొంత మంది రైతుల సహకారంతో ఆయన మూడు రోజుల పాటు శ్రమించి గండ్లు పడిన చోట వరిగడ్డి, ఇసుక బస్తాలను అడ్డుగా వేసి చెరువు నీటి వృథాకు అడ్డుకట్ట వేశారు. అయితే పూర్తిస్థాయిలో చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆయన విన్నవించారు. చెరువు కింద వందలాది ఎకరాల సాగుభూమి ఉందన్నారు. ఇదిలా ఉంటే గండ్లుపూడ్చి చెరువు నీటి వృథాను అరికట్టడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సీఐ

చింతపల్లి, సెప్టెంబరు 21: యువత, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నాంపల్లి సీఐ నవీన్ అన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్ జడ్పీహెచ్ఎస్‌లో శనివారం పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి జర్పుల పద్మ, పీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చల్లం పాండురాంగరావు, అధ్యాపకులు అన్వర్, గోపాల్, చైర్మన్ చంద్రకళ పాల్గొన్నారు.

తెలంగాణ కోసం పరితపించిన లక్ష్మణ్‌బాపూజీ

నల్లగొండటౌన్, మిర్యాలగూడ, చింతపల్లి, మిర్యాలగూడ టౌన్, చిట్యాల, నల్లగొండ కల్చరల్, మునుగోడు, దేవరకొండ, సెప్టెంబరు 21: తెలంగాణ కోసం అహర్నిశలు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పరితపించారని పలువురు పేర్కొన్నారు. జిల్లాలో శనివారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ దేశ స్వాతంత్రోద్యమ పోరాటం, నిజాం వ్యతిరేకంగా జరిగిన పోరాటం, ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన తొలి, మలిదశ పోరాటాల్లో పాల్గొన్న గొప్పనాయకుడని కొనియాడారు. తెలంగాణ కోసం తన మంత్రి పదవికి రాజీనామా చేసి పోరాటం చేసిన గొప్ప త్యాగజీవి అని అన్నారు. అదేవిధంగా చేనేత కార్మికుల కోసం, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం జీవితాంతం పరితపించారని కొనియాడారు.

● జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ రోడ్డులోని పాల కేంద్రం వద్ద గల ఉన్న బాపూజీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిప్రోలు వెంకటపతి, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంగూరు నారాయణయాదవ్, బెస్త సంఘం జిల్లా అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, జల్లా బిక్షం, మిర్యాల సోమయ్య, చిలువేరు చంద్రయ్య, యాదన్న యాదవ్, అజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

● బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ జలదృశ్యం వద్ద గల బాపూజీ విగ్రహానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, వర్కింగ్ ప్రెసెంట్ మార్గం సతీష్‌కుమార్, నాయకులు పున్న పాండు, వెంకట్ పాల్గొన్నారు.



మిర్యాలగూడలో బాపూజీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

● మిర్యాలగూడలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చేతివృత్తుల వారికి సహకార చట్టాలను ఏర్పాటు చేసి వారి యొక్క అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలీ సంఘం శాశ్వత అధ్యక్షుడు యర్రమాద రాములు, నాయకులు చిలుకూరి బాలు, కౌన్సిలర్ చిలుకూరి శ్యామ్‌రమాదేవి, బావాండ్ల పాండు, రాపోలు వెంకటేశ్వర్లు, జిల్లా రాంబాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కృష్ణయ్య పాల్గొన్నారు.

● చింతపల్లిలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు చిట్టిప్రోలు వెంకటేశ్వర్లు, కమిటీ చైర్మన్ పున్న సత్యనారయణ, సంఘం అధ్యక్షుడు మునగపాటి సత్యనారాయణ, కర్నాటి గణేష్, ముత్యాలు, జగదీష్, శ్రీనివాస్, నరసింహ పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పోగుల సైదులుగౌడ్, కొణగంటి వెంకన్న, చేగొండి మురళి, బంటు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నాగు తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాలలో చిట్యాలలో యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐలాపురం నరేష్, మద్ది మధు, చింతపల్లి ప్రవీణ్, గూడ అఖిల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాటి యాదగిరి, కార్యదర్శి రాపోలు సతీష్ కుమార్, మిర్యాల వెంకటేశం, రాష్ట్ర నాయకుడు రాపోలు దత్త గణేష్, కౌన్సిలర్ గుర్రం ధనలక్ష్మి, పున్నం గణేష్, రావిరాల పూజితవెంకటేశ్వర్లు, జెల్లా భిక్షం, యాదగిరి పాల్గొన్నారు.

● మునుగోడులో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మునుగోడు మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, సంఘం నాయకులు సంగిశెట్టి పరమేశం, కొంగరి కృపానందం, మధుకర్, కుమారస్వామి, నర్సింహ, ప్రభాకర్, వీరేశం, మారయ్య, రమాశంకర్ పాల్గొన్నారు.

● దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు చొల్లేటి భాస్కరచారి, అంకం చంద్రమౌళి, కృష్ణచారి, వీరయ్య, శ్రీనివాసులు, బ్రహ్మచారి, శారద తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ: బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు



మునుగోడులో నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



నల్లగొండలో నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

సామాజిక రుగ్మతలను రూపుమాపాలి

● ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి

శాలిగౌరారం, సెప్టెంబరు 21: సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారం మండలంలో పనిచేస్తూ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 18 మంది ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రేపటి భావిభారత పౌరులైన విద్యార్థులకు విద్యతో పాటు వారి నైపుణ్యాలను గుర్తించే బాధ్యత నవ సమాజ నిర్మాతలైన ఉపాధ్యాయులదేనని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని, విద్యార్థులను భావి భారతపౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని కొనియాడారు. ప్రభుత్వం పాఠశాలల బలోపేతం కోసం అన్ని చర్యలు చేపడుతుందని అన్నారు. పదేళ్ల నుంచి నిర్వీర్యమైన ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు అంటే కేవలం గురువులే కాదు విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దే దర్శకులని కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయులగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.యాదగిరి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంఈవో నాగయ్య, నోడల్ ఆఫీసర్ మామిడి సైదులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు పున్న శ్రీనివాస్, రాకేష్‌కుమార్, బందెల సైదులు, వెంకటరమణ, నాయకులు ఎర్ర యాదగిరి, దండ అశోక్ రెడ్డి, చింత ధనుంజయ్, వడ్లకొండ పరమేష్‌గౌడ్, రంగారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

స్వచ్ఛతలో ప్రజలు సామూహిక భాగస్వాములు కావాలి

దేవరకొండ, సెప్టెంబరు 21: స్వచ్ఛతలో దేవరకొండ మునిసిపాలిటీ ప్రజలు భాగస్వాములు కావాలని, తమ కాలనీల్లో పరిశుభ్రతను పాటించాలని మునిసిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి కోరారు.దేవరకొండలో శనివారం స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభించి పదేళ్ల పూర్తయిన సందర్భంగా స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటీ పరిధిలోని ఎస్బీఆర్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మునిసిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లో ప్రజలు పరిశుభ్రత పాటించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త తీసుకెళ్లే మునిసిపాలిటీ వాహనాలకు అందించాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహేష్, మునిసిపల్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న మునిసిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి

అందరూ సమతుల ఆహారాన్ని తీసుకోవాలి

చిట్యాలరూరల్, వేములపల్లి, నాగార్జునసాగర్, తిప్పర్తి, సెప్టెంబరు 21: ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు, చిన్నారులతో పాటు కిషోరబాలలు కూడా సమతుల ఆహారాన్ని భుజించాలని సీడీపీవో లావణ్యకుమారి అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. చిట్యాల మండలం వెలిమినేడులోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థినులకు పీహెచ్‌సీ వైద్యాధికారి ఉబ్బు నర్సింహ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అంతేకాకుండా క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● వేములపల్లి మండలంలోని మంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజిని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు కళావతి, జ్యోతి, సుజాత, ఆయా దేవకమ్మ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ, హెచ్ఎం శేషు, విమల, లింగయ్య, సావిత్రమ్మ, ప్రవీన్, నిర్మల, సైదమ్మ, దేవిక, పుష్ప, ఆదిలక్ష్మీ, సరళ తదితరులు పాల్గొన్నారు.

● తిప్పర్తి ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. విద్యార్థులు నాణ్యమైన ఆహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి ప్రదీప్ కుమార్ అన్నారు. విద్యార్థులు నాణ్యమైన ఆహారం తీసుకోవాలి. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.జ్యోతి, పర్వీన్ సుల్తానా, మమత, రజిత, జె.జానమ్మ, శైలజ, స్లీవ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో లావణ్యకుమారి

నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 21: విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెరుగైన విద్య అందించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. నియోజకవర్గంలోని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరుపై శనివారం ఎమ్మెల్యే బాలునాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల నిర్వహణపై ఆర్‌సీవోలు, ప్రిన్సిపాళ్లతో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ వసతి గృహాల పనితీరు మెరుగుపడాలని ఆయన సూచించారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని కోరారు. ఆకస్మిక తనిఖీ చేపట్టి ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఆయా గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్లు విష్ణుమూర్తి, సంధ్య, అగస్టీన్, గురుకులాలు, వసతి గృహాల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు

దేవరకొండ, సెప్టెంబరు 21: దేవరకొండ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూళ్లు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈవో మాత్యనాయక్ హెచ్చరించారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల నాయకులు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం ఎంఈవో లిటిల్‌ఫ్లవర్ పాఠశాలను తనిఖీ చేశారు. అధిక ఫీజులు వసూళ్లు చేస్తే చర్యలు తీసుకుంటామని, విద్యాశాఖ సూచించిన నియమ, నిబంధనలు పాటించాలని యాజమాన్యాన్ని కోరినట్లు ఎంఈవో తెలిపారు.

సంక్షేమ బోర్డు కోసం పోరాడాలి

చిట్యాల, సెప్టెంబరు 21: భవన నిర్మాణ కార్మికులంతా సంక్షేమ బోర్డు కోసం పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. సంక్షేమ బోర్డు పథకాలను బీమా కంపెనీలకు అప్పజెప్పవద్దని కోరుతూ శనివారం చిట్యాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద మృతికి రూ.10లక్షలు, సహజ మరణానికి ఐదు లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 23వ తేదీన హైదరాబాద్‌లో జరిగే ధర్నా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రుద్రవరం మహేష్, పాల నర్సింహ, జిట్ట రవి, నోముల పురుషోత్తం, మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 21: ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని ఎంఈవో బాలాజీనాయక్ అన్నారు. పీఆర్టీయూ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను శనివారం గాంధీపార్కు పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు పాఠ్యాంశాలతో పాటు విలువలు నేర్పాలన్నారు. అన్ని బాధ్యతల కంటే గురువు బాధ్యత గొప్పదని, ఆ వృత్తిలో ఉత్తములుగా గుర్తింపు పొందడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మునగాల రాంరెడ్డి, అనుముల సైదిరెడ్డి, కురువానాయక్, కిరణ్‌కుమార్, ధర్మానాయక్, రమణాచారి, గురులక్ష్మీ, అరుణ, ఇందిర, నిర్మల, హారిక పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ కల్తీపై సీబీఐ విచారణ జరపాలి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 21: తిరుమల లడ్డూ కల్తీపై సీబీఐ విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో శనివారం సబ్ కలెక్టర్‌కు అమిత్‌నారాయణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి మాట్లాడుతూ శ్రీవారి ప్రసాదంలో జంతువుల కొవ్వును కలపడం అపచారమన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్ర ప్రతిష్టను దెబ్బతీసే చర్యలకు ఉపక్రమించడం క్షమించరానిదన్నారు. హిందూధర్మంపై జరిగిన జరిగిన కుట్రగా అభివర్ణించారు. లడ్డూ తయారీలో జరిగిన పాపాలపై సీబీస విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రేపాల పురుషోత్తంరెడ్డి, ఎడ్ల రమేష్, వనం మదన్‌మోహన్, కొండేటి సరిత, అభి, శివ, అజయ్, నవీన్, మణిలాల్, సోములు, లక్ష్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

దేవరకొండ: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రూ.8వేల కోట్లకు పైగా స్కాలర్ షిపల్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్, ఇద్దిరాములు, రాకేష్, చరణ్, మనోహర్ పాల్గొన్నారు.

నేరేడుగొమ్ము: ఆర్టీసీ కార్గో పార్సిల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ కార్గో పార్సల్ సర్వీస్ నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో ఆర్టీసీ లాజిస్టిక్ కార్గో సేవలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో కార్గో ఉత్తమ సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో శ్యాం, హరిలాల్, బిచ్చు తదితరులు పాల్గొన్నారు.

దామరచర్ల: వసతి గృహాల వార్డెన్లు, సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో శ్రీనివాసమూర్తి హెచ్చరించారు. మండలకేంద్రంలోని ఎస్టీ బాలుర వసతిగృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో ఒక్క వంట మనిషి తప్ప వార్డెన్, ఇతర సిబ్బంది లేకపోవడంతో వార్డెన్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు.

చందంపేట: చందంపేట మండలంలోని కొరుట్ల, మురుపునూతలలోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలలోని బాలింతలు, గర్భిణుల వివరాలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించారు.

నాగార్జునసాగర్: టీపీఆర్టీయూ సాగర్ అర్బన్‌శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం సాగర్ పైలాన్ కాలనీలోని మోడల్ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అర్బన్‌శాఖ అధ్యక్షుడిగా వట్టిపల్లి అంజయ్య, కార్యదర్శిగా వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళా కార్యదర్శిగా గణేశ్వరి, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, బిక్షంగౌడ్, రాంచంద్రారెడ్డి, వీరారెడ్డి, పాపిరెడ్డి, ప్రకాష్, లక్ష్మ పాల్గొన్నారు.

గట్టుప్పల్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని సీపీఎం నాయకులు కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, పెదగాని నరసింహ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదల కోసం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. మండలంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని అన్నారు.

చిట్యాలరూరల్: మండలంలోని నేరడ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు కస్తూరి ఫౌండేసన్ చైర్మన్ కస్తూ చరణ్ సౌజన్యంతో సమకూర్చిన బ్యాగులు, నోట్ పుస్తకాలను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధికి కస్తూరి ఫౌండేషన్ అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో వీరమళ్ల కార్తీక్, పెంటయ్య, మహేష్, నరేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ఎలిజాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పట్టణంలోని సాగర్ రోడ్డులో గల రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం పింక్ కలర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పింక్ కలర్ డ్రెస్‌లతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం విద్యార్థులకు పాటలు, డ్యాన్స్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.ఆనందరెడ్డి, ప్రిన్సిపాల్ పర్వీన్ సుల్తానా, టీచర్లు ఉమామహేశ్వరి, సుష్మ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: ప్రయాణికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని షీ టీమ్ ఏఎస్ఐలు తబిత, బిక్షం అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు అవగాహన కల్పించారు. ఎస్పీ పవార్, షీ టీమ్ సీఐ సైదులు సూచనల మేరకు మహిళలు, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెరుమాళ్ల మధు, గోపనబోయిన శ్రీనివాస్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ పట్టణ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మూడుదుడ్ల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు చామల గౌరయ్య, చిట్టిప్రోలు శివలింగం, ప్రధాన కార్యదర్శి బోనగిరి యాదగిరి, సహాయ కార్యదర్శి గడ్డం ఉపేందర్, కోశాధికారి అలువాల నరేందర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

చింతపల్లి: మండల పరిధిలోని ఎం.మల్లేపల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద భక్తులు లక్ష్మీగణపతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఎగిరిశెట్టి అనిత శ్రీశైలం పాల్గొని మాట్లాడారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అర్చకులు రవీంద్రనాథ్‌శర్మ, మాజీ సర్పంచ్ మర్ల ప్రేమలత వెంకటయ్య, క్రాంతిరెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

కనగల్: పలు కేసుల్లో కక్షిదారులుగా ఉన్నవారు ఈ నెల 28వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. ఏళ్ల తరబడి పరిష్కారం నోచుకొని కేసులకు రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని లోక్‌అదాలత్‌ చక్కటి వేదికన్నారు.

చిట్యాలరూరల్: సీపీఎంలో సాధారణ స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగి విలువలతో కూడిన రాజకీయాలు చేసిన నాయకుడు సీతారాం ఏచూరి మాజీ జడ్పీటీసీ పామనగుళ్ల అచ్చాలు కొనియాడారు.

త్రిపురారం: త్రిపురారం మండల కేంద్రంలోని ఆల్ఫా పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన మాస్టర్ చెఫ్ కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యార్థులు స్వయంగా వివిధ రకాల వంటకాలను తయారు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సలీం మాట్లాడుతూ విద్యార్థులకు ఆహార పదార్థాల తయారీపై అవగాహన పెంచుకోవడానికి మాస్టర్ చెఫ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రసరాజు, గోవర్ధన్‌రెడ్డి, టుపాల్‌రెడ్డి, బాబా, సలీం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: సాగర్ హిల్‌కాలనీ బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 250మంది కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. వారిలో 40మందికి కంటి అద్దాలు అవసరం అవుతున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఏటీపీ గాయత్రి, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ రాంబాబు, ప్రకాష్ పాల్గొన్నారు.